ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

శుక్రవారం 12 జనవరి 2024



నీటిలో నానుతున్న శనగ పైరు (ఫైల్)



మిర్చిపైరులో నిలిచిన నీరు (ఫైల్)

- మిచౌంగ్‌తో మునిగిన రైతులు
- 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- నష్టంపై ప్రభుత్వానికి వెళ్లిన నివేదికలు
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

పరిహారం.. ఎప్పటికో?

మిచౌంగ్ ముంచి రోజులు గడుస్తున్నా.. రైతులకు పరిహారంపై ప్రభుత్వం మౌనం వీడటంలేదు. తుఫాన్ కారణంగా చేతికందే దశలోని, కొత్త దశలోని పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. రోజుల తరబడి పంట చేలు వర్షపు నీటిలోనే ఉండటంతో రైతులు నిండా మునిగిపోయారు. ఇటు జిల్లా అధికారులు.. అటు కేంద్ర బృందం పంట నష్టం అంచనాలపై పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆలస్యంగా అయినా పంట నష్ట పరిహారం అందుతుందని ఆశించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిరాశకు గురవుతున్నారు. నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఊసే లేకపోవడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి వెళ్లి రోజులు గడుస్తున్నా పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల రెక్కల కష్టం మిచౌంగ్ తుఫాన్ తుడిచిపెట్టేయగా.. పాలకులు పరిహారం గురించి పట్టించుకోకుండా రైతులను పరిహసిస్తున్నారు. తుఫాన్ ఆనవాళ్లు చెదిరిపోయినా నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి అందలేదని రైతులు వాపోతున్నారు. ఇంటికి చేరాల్సిన పంటలను వర్షం ముంచేయగా.. ప్రభుత్వం పరిహారం అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భారీ వర్షాలు, పెనుగాలులు చుట్టేయడంతో రైతులు నిండా మునిగిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు మిచౌంగ్ తుఫాను తీవ్ర నష్టం కలిగించింది. రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మిచౌంగ్ తుఫాన్ పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు తీవ్ర నష్టం కలిగించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావమే చూపింది. చెరువులను తలపించేలా పొలాలు మునిగిపోయాయి. వరి, పత్తి, శనగ, మొక్కజొన్న, మినుము, పొగాకు తదితర పంటలకు అపార నష్టాన్ని కలిగించాయి. మిరప, అరటి, బొప్పాయి, పండ్లు, పూల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాలను నమోదు చేశారు. ప్రాథమిక అంచనాల అనంతరం పూర్తి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇన్‌పుట్ సబ్సిడీకి వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. కేంద్ర బృందం పరిశీలన పూర్తై రోజులు గడుస్తున్నది. అయితే ఇంత వరకు రైతులకు పంట నష్ట పరిహారం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పరిహారం ఎప్పుడు వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. భారీ వర్షాలు రైతులను కోలుకోలేకుండా దెబ్బతీస్తే ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండం తమను దగా చేయడమేనని రైతులు వాపోతున్నారు.



నీటిలో మునిగివున్న వరి చేను (ఫైల్)

బాపట్ల జిల్లాలో..

సముద్ర తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న బాపట్ల జిల్లాను మిచౌంగ్ తుఫాన్ వణికించింది. జిల్లా పరిధిలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. 2.68 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు దారుణంగా నష్టపోయారు. వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. వరి 1.97 లక్షల ఎకరాలు, శనగ 29,750 ఎకరాలు, మినుము 3,605 ఎకరాలు, పొగాకు 14,472 ఎకరాలు, మొక్కజొన్న 9,172 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు కట్టారు. ఉద్యాన పంటలు 14,030 ఎకరాల్లో నష్టం వాటిల్లగా ఇందులో మిర్చి 10,315 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చారు.

గుంటూరు జిల్లాలో ..

మిచౌంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. 1,21,400 ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ప్రధానంగా వరి పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. వరి 93,850 ఎకరాల్లో దెబ్బతిన్నది. పత్తి 2,550 ఎకరాలు, మినుము 4,397 ఎకరాలు, శనగ 16,930, పొగాకు 2,430 ఎకరాలు, వెయ్యి ఎకరాల్లో జొన్న, 243 ఎకరాల్లో మొక్కజొన్న, 16,507 ఎకరాల్లో మిరప, 1,497 ఎకరాల్లో అరటి, 1,225 ఎకరాల్లో పూలు, కూరగాయలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.



పొగాకు చేలో నీరు (ఫైల్)

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో 36,725 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2,356 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. 10,605 ఎకరాల్లో శనగదెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. 9,859 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. పంట నెలరోజుల వ్యవధిలోనే దెబ్బతినడంతో ఇన్‌పుట్ సబ్సిడీ పరిధిలోకి రాదని వ్యవసాయ శాఖ వెల్లడించింది. నెల రోజుల వ్యవధి పంటకు ఎకరానికి కనీసం రూ.10 వేలు రైతులు ఖర్చు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చయినట్లు బాధిత రైతులు తెలిపారు. అయినా శనగ పంటకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందే పరిస్థితి లేదు. శనగ సాగు చేసుకునేందుకు విత్తనాన్ని 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తూ చేతులు దులుపుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పరిహారం చెల్లించాలని కోరుతున్నా మొర ఆలకించే పాలకులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది 1357 ఎకరాల్లో, పొగాకు 1543 ఎకరాల్లో, మొక్కజొన్న 600 ఎకరాల్లో, వరి 2,610 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.



బాలికను పరామర్శిస్తున్న ఇన్‌చార్జి ఎంహెచ్‌వో మధుసూదన్‌రావు

పెట్రేగుతున్న కుక్కలు

- సంపత్‌నగర్‌లోనే మరో దాడి
- స్థానికుల అప్రమత్తతో తప్పించుకున్న బాలిక
- పారిపోయే ప్రయత్నంలో కింద పడి గాయాలు

గుంటూరు, గుంటూరు(కార్పొరేషన్), జనవరి 11: గుంటూరు కుక్కల రాజ్యంలా మారిపోయింది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా వీధి కుక్కలు. పిల్లలు కనిపిస్తే దాడి చేస్తున్నాయి. గత నెలలో సంపత్‌నగర్‌లో మేయర్ మనోహర్‌నాయుడి ఇంటి సమీపంలో కుక్కలదాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన మరువక ముందే ఆ ప్రాంతంలో గురువారం కుక్కలు ఓ బాలికపై దాడికి యత్నించాయి. స్థానికులు అప్రమత్తంగా ఉండి వాటిని తరమడంతో బాలిక తప్పించుకుంది. అయితే కుక్కల నుంచి పారిపోయే క్రమంలో కిందపడి బాలికకు గాయాలయ్యాయి. పిడుగురాళ్ల చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి భార్య, కుమార్తె లావణ్యలు సంపత్‌నగర్‌లోని అత్తవారింటికి వచ్చారు. ఈ క్రమంలో ఇంటి ముందు రోడ్డు పైన లావణ్య ఆడుకుంటుండగా ఆ ప్రాంతంలోని కుక్కలు చుట్టుముట్టి బాలికపై దాడికి ప్రయత్నించాయి. దీంతో బాలిక పెద్ద ఎత్తున కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. దీంతో బాలికకు ప్రాణపాయం తప్పింది. అయితే కుక్కల నుంచి తప్పించుకునే క్రమంలో కింద పడి గాయపడగా స్థానికులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గత నెల 30న హైదరాబాద్‌కు చెందిన ఓ బాలుడిపై ఇదే ప్రాంతంలో కుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఇలా తరచూ నగరంలో ఏదో ఒక ప్రాంతంలో కుక్కలు దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోర్టు ఆదేశాలని పట్టించుకోని అధికారులు

కుక్కలు నగర వాసులను వణికిస్తు న్నాయి. నగరమంతా కుక్కలమయంగా మారింది. ఆయా వీధుల్లో నడిచి వెళ్లే వారేగాక ద్విచక్ర వాహనా ల్లో వెళ్లే వారిని సైతం వెంటపడుతూ భయాందోళన కలిగిస్తు న్నాయి. గతంలో వీధి కుక్కలను నగరపాలక సంస్థ స్పెషల్ డ్రైవ్ ద్వారా పట్టుకుని ఊరు బయట వదిలేసేవారు. అయితే వాటిని హింసిస్తున్నారని జంతు ప్రేమికులు కోర్టును ఆశ్రయిం చిన నేపథ్యంలో కొద్ది నెలలుగా నగరపాలక సంస్థ అధికారులు పట్టుకునే విషయాన్ని పక్కన పెట్టేశారు. దీంతో నగరంలో కుక్కల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. ఏ వీధిలో చూసినా గుంపులు, గుంపులుగా దర్శనమిస్తున్నాయి. గతంలో వీధుల్లో కుక్కలు ఉండాలని, రాత్రివేళ అనుమానాస్పద వ్యక్తులు, దొంగల నుంచి రక్షణ ఉంటుందని ప్రజలు భావించేవారు. కానీ నేడు కుక్కలంటేనే భయపడే పరిస్థితులు నెలకున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా కుక్కలు వీధుల్లో దారి వెంట వెళ్లే వారిని వెంటబడి కరుస్తున్నాయి. రోడ్డుపైకి రావాలంటేనే పిల్లలు, మహిళలు, వృద్ధులు వణికిపోతున్నారు. కుక్కలు ద్విచక్ర వాహనాల వెంటపడటంతో జరిగిన ప్రమాదాల కారణంగా పలువురు గాయపడ్డారు. విద్యానగర్‌లో ఇటీవల ఇద్దరికి కాళ్ళు, ఒకరికి చేయి విరిగింది. నగరంలో కుక్కలు బెడద తీవ్ర స్థాయిలో ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు కోర్టు ఆదేశాలను బూచిగా చూపి ప్రజల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారన్న ఆరోపణలు న్నాయి.



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విజయవాడలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలో అద్దేపల్లి సునీత(సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల) ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది.

ఉదయ్.. వచ్చేస్తోంది

- రైలు ప్రారంభానికి కుదరిన ముహూర్తం
- నేడు గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రారంభోత్సవం
- నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్‌కూ పచ్చజెండా

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి ఎప్పుడా.. ఎప్పుడా అని ఎదురుచూస్తోన్న ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుంటూరు పర్యటన ఖరారు కావడంతో విశాఖపట్టణం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు పొడిగింపు ప్రారంభోత్సవ ముహూర్తాన్ని రైల్వే శాఖ ఖాయం చేసింది. ఏడాదిగా ఈ రైలు గుంటూరు ప్రయాణికులను ఊరిస్తూ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోండగా ఎట్టకేలకు శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో కూత పెట్టనుంది. మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ రైలుకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. నెంబరు.22701 విశాఖ - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ వారంలో ఆది, గురువారాలు మినహా మిగతా ఐదు రోజులు సర్వీసు ఉంటుంది. ఈ రైలు వేకువజామున 5.20కి విశాఖలో బయలుదేరి దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదగా మధ్యాహ్నం 1 గంటకు గుంటూరు చేరుకుంటుంది. నెంబరు.22702 గుంటూరు - విశాఖ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా ప్రయాణించి రాత్రి 10.55కి విశాఖ చేరుకుంటుంది. ఈ రైలులో ఏసీ చైర్‌కార్, సెకండ్ సిట్టింగ్ భోగీలున్నాయని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

మరో రెండు రైళ్లకు కూడా..

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌తో పాటుగా మరో రెండు రైళ్లకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వీడియో లింకు ద్వారా జెండా ఊపి ప్రారంభించనున్నారు. ప్రస్తుతం విజయవాడ - హుబ్లీ మధ్య గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్ వరకు పొడిగించారు. నెంబరు.17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి నిత్యం సాయంత్రం 4.10కి బయలుదేరి పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ మీదగా విజయవాడకు చేరుకుని అక్కడి నుంచి ప్రస్తుతం ప్రయాణిస్తున్న సమయపట్టికలోనే గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.20కి హుబ్లీ చేరుకుంటుంది. నెంబరు.17226 హుబ్లీ - నరసపూర్ రైలు నిత్యం మధ్యాహ్నం 1.20కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.25కి గుంటూరు, 3.40కి విజయవాడ, మరుసటి రోజు ఉదయం 7.40కి నరసపూర్ చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లతో పాటు నంద్యాల-కడప రైలుని రేణిగుంట వరకు పొడిగించనున్నారు. ఈ పొడిగింపులతో గుంటూరుకు కొత్తగా ఉదయ్ ఏసీ ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లు

మంగళగిరిలో.. ఇద్దరు ఇన్‌చార్జీలు

- ఒకరు అధికారికం.. మరొకరు అనధికారికం
- రబ్బరుస్టాంపుగా మారిన గంజి చిరంజీవి
- వేమారెడ్డి కనుసన్నల్లో అధికారిక వ్యవహారాలు

మంగళగిరి, జనవరి 11: సాధారణంగా ఏ రాజకీయపార్టీకైనా నియోజకవర్గంలో ఎమ్మెల్యే లేకుంటే పార్టీ తరఫున ఇన్‌చార్జిని నియమించుకుంటుంది. కానీ ఇటీవల వైసీపీ విచిత్ర విధానాన్ని ప్రవేశపెట్టింది. తమ పార్టీ ఎమ్మెల్యే ఉన్నా రానున్న ఎన్నికల్లో టిక్కెట్‌ను నిరాకరిస్తూ ఎన్నికల ముందే అక్కడ అభ్యర్థిని సూచిస్తూ ఇన్‌చార్జిలను నియమించుకునే ఓ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇదే ఓ విచిత్రమైతే.. మంగళగిరిలో ఇంకో విచిత్రం నెలకొంది. ఈ నియోజకవర్గంలో వైసీపీకి ఇద్దరు ఇన్‌చార్జులు కొనసాగుతున్నారు. వీరిలో ఒకరు అధికారికంగా నియమితులైతే.. ఇంకొకరు అనధికారికంగా అసలు ఇన్‌చార్జికన్నా మరింత పవర్‌ఫుల్‌గా చక్రం తిప్పేస్తున్నారు. అధికారికంగా గంజి చిరంజీవి ఇన్‌చార్జికాగా తాడేపల్లి రెబల్‌స్టార్ దొంతిరెడ్డి వేమారెడ్డి అనధికారికంగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే ఆళ్లకు పొగబెడుతూ ఇన్‌చార్జిగా చిరంజీవి నియామకం చేయనున్న తరుణంలో ఆయన ముందుగానే పార్టీనుంచి వైదొలిగారు. అయితే ఇన్‌చార్జిగా చిరంజీవికి పార్టీ, అధికారిక వ్యవహారాలకు చుక్కెదురవుతోంది. ఆళ్ల పార్టీ నుంచి తప్పుకున్న వెంటనే ఎంటీఎంసీ నగర వైసీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి యాక్టివయ్యారు. తాడేపల్లి టౌన్ అండ్ రూరల్ ప్రాంతాల్లో అధికారిక కార్యక్రమాలతో పాటు, పార్టీ వ్యవహారాలన్నీ ఆయన తన కనుసన్నల్లోనే నడిపిస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో చిరంజీవికి ప్రవేశమే లేదు. వేమారెడ్డి ఆదేశాల మేరకే తాజాగా తాడేపల్లి రూరల్ మండల కమిటీ నియామకం జరిగింది. తాడేపల్లి టౌన్, రూరల్ ప్రాంతాలకు చెందిన పార్టీ క్యాడర్ కూడా అన్నింటికి వేమారెడ్డినే సంప్రదించడం కూడా చిరంజీకి జీర్ణం కాకుండా ఉంది. మంగళగిరి ప్రాంతానికి చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా తనను పట్టించుకోవడం లేదని చిరంజీవి వాపోతున్నారు.

అక్రమ క్వారీయింగ్ కూడా..

ఎమ్మెల్యే ఆళ్ల అస్త్రసన్యాసం చేసి వెళ్లిపోయిన రెండో రోజు నుంచే నియోజకవర్గంలో అక్రమ క్వారీయింగ్‌కు తెరదీశారు. తాడేపల్లి ఏరియా బ్రహ్మానందపురంలో ఎయిమ్స్‌కు వెళ్లే దారిలో ఉన్న కొండను క్వారీయింగ్ చేయిడం ప్రారంభించారు. దుగ్గిరాల మండలం గొడవర్రు-పెదకొండూరు మధ్య కృష్ణానదీ తీరం వెంబడి కూడా అనధికార ఇసుక క్వారీయింగ్‌ను ప్రారంభించారు. ఈ ఇసుక క్వారీయింగ్‌ను తెనాలి నుంచి వచ్చిన ఓ పోలీసు అధికారి అడ్డుకున్నప్పటికీ... ఇద్దరు ఇన్‌చార్జులు కలిసి ప్రభుత్వ ముఖ్య సలహాదారు కార్యాలయం నుంచి ఫోన్లు చేయించి ఆ అధికారిని అటునుంచే అటే పంపిచేశారని వినికిడి. ఇలా అవసరమైన సమయాల్లో తనను కలుపుకుంటూ మిగతా సమయాల్లో తన ప్రమేయం లేకుండా వ్యవహారాలను చక్కబెట్టేస్తున్న వేమారెడ్డిని ఏమంటే ఏం కొంప మునుగుతుందోనన్న ఆందోళనతో చిరంజీవి మింగలేక కక్కలేక తల్లడిల్లిపోతున్నారని ఆయన అనుచరులు బాధపడిపోతున్నారు. చేనేత వర్గానికి చెందిన ఉడతా శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇవ్వాలని అధిష్ఠానం వద్ద వేమారెడ్డి అండ్ కో పట్టుబడుతున్నట్టు సమాచారం. ఇన్‌చార్జిగా చిరంజీవి నియామకం జరిగిన తర్వాత చేనేతవర్గాల్లో ఆశించినంత స్పందన కానరాకపోవడాన్ని కూడా వారు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిణామాలతో చిరంజీవికి ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఉడతా శ్రీనివాసరావు, పారేపల్లి మహేష్ పేర్లను ఐప్యాక్ బృందం అధిష్ఠానానికి నివేదించిందనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఇవన్నీ పుకార్లని చిరంజీవి ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న ఎన్నికల్లో మంగళగిరి నుంచి తానే వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ఆయన చెప్పుకుంటున్నారు.



గుంటూరు.. భళా

- అభివృద్ధిలో రెండు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 17వ ర్యాంకు
- న్యూఢిల్లీలో అవార్డులు అందజేసిన కేంద్ర మంత్రి హరదీప్

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 11: వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గుంటూరు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న స్వచ్ఛ నగరాల్లో గుంటూరు జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్‌తో 2వ ర్యాంక్ సాధించింది. స్వచ్ఛసర్వేక్షణ్‌లో గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ సారి 17వ ర్యాంక్ సాధించింది. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023 అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ నుంచి ఆయా అవార్డులను నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తిలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ ర్యాంకులను 2016 నుంచి జాతీయస్థాయిలో కేటాయిస్తుందన్నారు. ప్రజారోగ్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి, సహకారంతోనే ఈ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. గత ఏడాది జాతీయస్థాయిలో 108 ర్యాంక్ సాధించగా ఈ సారి 17వ ర్యాంకు వచ్చిందన్నారు. రానున్న కాలంలో ప్రజల సహకారంతో నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా మార్చుకుంటూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత మెరుగైన ర్యాంక్ సాధనకు కృషి చేస్తామని తెలిపారు



ఢిల్లీలో కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న రాష్ట్ర మంత్రి సురేష్, మేయర్ మనోహర్, కమిషనర్ కీర్తి

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

మిర్చియార్డులో హమాలీల ఆందోళన

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో హమాలీలు మెరుపు ఆందోళనకు దిగారు. గురువారం మధ్యాహ్నం రైతులు తమకు ఇచ్చిన మచ్చుకాయలను బయటకు తీసుకెళుతుంటే 60 ఏళ్ల వయస్సు పైబడిన ముఠా కార్మికుడిపై ఇద్దరు మహిళా సెక్యూరిటీ సిబ్బంది భౌతికంగా దాడి చేసి లాక్కొన్నారని ఆరోపిస్తూ గుంటూరు - హైదరాబాద్ జాతీయ రహదారిని గంటకు పైగా దిగ్బంధించారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసీపీ నేతలపై తిట్ల దండకం అందుకొని యార్డు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనగా వచ్చి యార్డు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. ఈక్రమంలో వీరికి కొంతమంది అసాంఘిక శక్తులు జత కలిసి అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, అటెండర్లపై చేయి చేసుకొన్నారు. మార్కెటింగ్ అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న ఆఫీసుల వద్దకు వెళ్లి తలుపులపై చేతులతో బాదుతూ లోనికి చొచ్చుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి వారిని వారించి బయటకు పంపేశారు. అనంతరం మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. యార్డులో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తమని దొంగల్లా చూస్తున్నారని, షాపులలోకి వచ్చి అన్ని శోధిస్తున్నారని, నానా దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు స్పందిస్తూ యార్డు అనేది రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసింది. ఇక్కడ రైతుకు నష్టం జరగడానికి వీలులేదు. మచ్చుకాయలు ఎవరూ తీసుకొన్నా చట్టరీత్యా నేరం. కావాలంటే మచ్చు కూలీ పెంచమని కోరితే చర్చలు జరిపి నిర్ణయం తీసుకొంటాం. అంతే తప్పా ఇలా ఆఫీసులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా అమానుషంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

విద్యుత్‌విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 261 మందికి రూ. 14.09 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 11: విద్యుత్ విజిలెన్స్ , ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కె సూర్యప్రకాష్ , గుంటూరుటౌన్-1 డివిజన్ ఆపరేషన్‌ఈఈ టి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి పెదకాకాని, వెనిగండ్ల, అగర్తవరపాడు, నంబూరు, ఐజెఎమ్ , ఉప్పలపాడు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3837 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌరానికి పాల్పడుతున్న 261 మందికి రూ. 14.09 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు.

14న గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ రైలు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07177 నరసపూర్ - హైదరాబాద్ రైలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 4.50కి హైదరాబాద్ చేరుకుంటుందన్నారు.

ఆరు రైళ్లకు అదనపు భోగీలు

ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శబరి, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు రెండు వైపులా అదనపు భోగీలు జోడిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఒక ఏసీ త్రీటైర్, రాయగ ఎక్స్‌ప్రెస్‌కి ఒక జనరల్ సిట్టింగ్, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కి మూడు జనరల్ సిట్టింగ్ భోగీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

ఉద్యోగ ఉపాధికి నిలయం అమరావతి

1486 వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు ,రైతులు

తుళ్లూరు జనవరి 11: రాష్ట్ర యువతకు ఉద్యోగ , ఉపాధి నిలయంగా అమరావతి రాజధాని ఉండేది మూడు ముక్కల ఆటతో అందరికి నిరాశే మిగిల్చారని , 33వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు,నిరసనలు దీక్షలు గురువారం నాటికి 1486వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ , ఆంధ్ర రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని ఒక్క అంగుళం కూడా కదల్చలేరని అన్నారు. ఐదు కోట్ల మంది అంగీకరించిన రాజధాని అమరావతి అని స్పష్టం చేశారు. పాలకుల సొంత ప్రయోజనాల కోసం ఆడుతున్న మూడు ముక్కల ఆటకు ప్రజలు వ్యతిరేకమన్నారు. తాము చేసిన పాద యాత్రలకు వచ్చిన స్పందనతో అమరావతిపై ప్రజలకు ఎంత అభిమానం , ఆప్యాయత ఉందో సీఎం జగన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా నాశనం చేయటానికే ఎక్కువ సమయం పాలకులు కేటాయించటం దుర్మార్గమన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంపద అమరావతిని నాశనం చేయవద్దన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

జడ్పీ స్టాడింగ్ కౌన్సిల్ గా 'వేముల'



జయపాల్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 11:గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్టాడింగ్ కౌన్సిల్ గా ప్రముఖ న్యాయవాది వేముల జయపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆయనకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, అడ్వకేట్ ప్యానెల్ ప్రతిపాదించిన న్యాయ వాదుల నుండి ఒకరిని స్టాడింగ్ కౌన్సిల్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ సంబంధించిన కేసులు అన్నింటిని సమర్ధవంతముగా వాదించి విజయాన్ని సాధించాలని జడ్పీ చైర్ పర్సన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

13 నుంచి 16 వరకు మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం, సంక్రాంతి పండగ దృష్ట్యా ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డుకు సెలవులు ప్రకటించినట్లు మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 17వ తేదీన బుధవారం యార్డులో లావాదేవీలు పునఃప్రారంభమౌతఆయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

తొలగిస్తే.. మరో ఉద్యమం తప్పదు

● 31వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



నిరసనల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

గుంటూరు(తూర్పు), జనవరి 11: విధుల్లో నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లో సమాధానం చెప్పాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారని ఇటువంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం నాటికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు వివిధ రూపాల్లో నిరసనలతో హోరెత్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు అతికించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు దీప్తి మనోజ, రాధాలు మాట్లాడుతూ అంగన్‌వాడీలను తొలగించాలని ప్రయత్నం చేస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. 31వ రోజు అంగన్‌వాడీల సమ్మెకు సీపీఎం నగర కార్యదర్శి కే నళినీకాంత్, సీపీఐ నగర కార్యదర్శి కే మాల్యాద్రి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు యూ గనిరాజు, సీపీఐ ప్రజాపోరు నాయకులు పి కోటేశ్వరరావు, జనతాదళ్ జిల్లా నాయకులు కేవీ కృష్ణారావు, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు సంఘీభావం తెలిపి ప్రసంగించారు. రిలే దీక్షల్లో రామకోటేశ్వరి, రోజా, ప్రియాంక, నీలిమ, తిరుపతమ్మ, ఏ పద్మ, లక్ష్మీ దుర్గ, కే లక్ష్మి కే కల్యాణి తదితరులు పాల్గొనగా, సమ్మెకు యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కే శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

హెల్త్ కార్డులపై పెన్షనర్లకు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి

● ఈదర వీరయ్య

గుంటూరు, జనవరి 11: పెన్షనర్ల హెల్త్‌కార్డుల సందేహాలకు బాధ్యత వహించే ఉద్యోగశ్రీ ట్రస్ట్ నిర్వహణ లోపరహితంగా ఉండేలా చర్యలు తీసుకొని పెన్షనర్లకు సత్వరం వైద్యం అందించాలని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శికి ఒక లేఖ రాసినట్లు తెలిపారు. హెల్త్ కార్డులతో ఆస్పత్రికి వెళ్ళినప్పుడు తాజా డేటా లేకపోవటంతో ప్రీ ఆథరైజేషన్ లభించటం లేదని, దీంతో వైద్యం అందించకుండా రోగులను (పెన్షనర్లను) బయటే వేచి ఉండమని ఆస్పత్రి యాజమాన్యాలు చెప్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఆరోగ్యకార్డులను వినియోగదారుల చట్టం పరిధిలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. డాక్టర్లు నిర్లక్ష్యం వహించినా, రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లినా పరిహారం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సర్వర్‌ను పటిష్టం చేసి డేటా అప్‌డేట్ చేయటం ద్వారా ఉద్యోగశ్రీకి పథకం లబ్ధిదారులైన పెన్షనర్లకు ఇబ్బందులు తొలగించాలని వీరయ్య కోరారు.

టీడీపీ నేతకు డేగల పరామర్శ



కాటంరాజును పరామర్శిస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన పాత గుంటూరు 4వ డివిజన్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తాడిబోయిన కాటంరాజును టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ గురువారం పరామర్శించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని డేగల భరోసా ఇచ్చారు. కాటంరాజును పరామర్శించిన వారిలో కొండెపు శేఖర్ యాదవ్, సుబ్బారావు, షేక్‌నియాజ్, నల్లమేకల శంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పట్టవా జగన్ రెడ్డి?

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి పట్టవా అంటూ డేగల ప్రభాకర్ నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రికి సమయం లేకపోవడం దారుణమని అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె జగన్‌రెడ్డికి కనపడటం లేదా అని ప్రశ్నించారు.

ఎయిమ్స్‌కు నీటి సరఫరా పనులు త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



ఎయిమ్స్ నీటి సరఫరా పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు సిటీ, జనవరి 11 : మంగళగిరి వద్ద ఉన్న ఎయిమ్స్‌కు నీటి సరఫరాకు అవసరమైన పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎయిమ్స్‌కు నీటి సరఫరాకు పైపులైన్ పనుల పురోగతిపై కలెక్టర్ ఛాంబర్ నందు ఆర్‌అండ్‌బీ, పబ్లిక్ హెల్త్, అటవీ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డేశ్వరం జంక్షన్ నుంచి ఎయిమ్స్ ఈస్ట్ గేట్ వరకు పైప్‌లైన్ వేయుటకు అటవీ శాఖ క్లియరెన్స్‌కు చెల్లించాల్సిన రుసుమును జమ కట్టి పైప్‌లైన్ పనులను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, పబ్లిక్ హెల్త్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్, గుంటూరు అటవీ శాఖ అధికారి మహబూబ్ బాష, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ సంపన్నరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న తోడుతో 46 వేల మంది చిరు వ్యాపారులకు లబ్ధి

జగనన్న తోడు పథకం 8వ విడత క్రింద జిల్లాలో 46,017 మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగనన్న తోడు 8వ విడత రుణ మంజూరు, వడ్డీ రాయితీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రుణాలు, వడ్డీ జమ కింద రూ.18.25 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, మిర్చి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కృష్ణ బలిజ, పూసల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పాలవెల్లువ పైదృష్టి సారించాలి

పెదనందిపాడు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో జగనన్న పాలవెల్లువ క్రింద పాల సేకరణకు సర్వే వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాలసేకరణకు భవనాల ఎంపిక పూర్తి కావడంతో ఫిబ్రవరి 1 నుంచి పాలసేకరణ పనులు ప్రారంభించాలని సూచించారు. కలెక్టర్ ఛాంబర్ నందు జగనన్న పాల వెల్లువ కింద పాల సేకరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ప్రజల స్పందనతో వైసీపీ పతనం ఖాయం

● టీడీపీ, జనసేన నేతలు కోవెలమూడి, బోనబోయిన



ఓబయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాని, బోనబోయిన, శేషయ్య

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీకి వస్తున్న ప్రజా స్పందనతో వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమయిందని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని), జనసేన సమన్వయకర్త బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పరిశీలకుడు కనకాచారి అన్నారు. గుంటూరు శ్రీనివాసరావుపేటలో గురువారం వారు 'భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్, ఒడ్డే ఓబన్న చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రా.. కదలిరా సభలకు వస్తున్న స్పందన చూస్తుంటే వైసీపీ పని అయిపోయినట్లు తేలిపోతోందని చెప్పారు. చంద్రబాబు ప్రజా సమస్యలను, ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రభుత్వానికి ఎత్తి చూపుతూ, ప్రజలకు భరోసా కల్పిస్తూ, జగన్‌రెడ్డి ప్రభుత్వ అన్యాయాలు, అక్రమాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ దూసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప్పుతల సాంబ, నిమ్మల శేషయ్య, నరసింహారావు, అమర్నాథ్‌రెడ్డి, నాగేంద్ర, సంకరావు, ప్రసాద్‌కుమార్, జనసేన నేత సానం రమేశ్, ఆళ్ల హరి, ప్రసాద్, కరీం, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 90శాతానికి పైగా హామీలు అమలు చేయడంలో జగన్ విఫలమయ్యారన్నారు. దగా, మోసాలకు అడ్డాగా మారిన జగన్‌కు ఒక్క ఛాన్స్‌చాలని, ఇక ఎలాంటి ఛాన్స్ ఇవ్వడానికి వీల్లేదని ప్రజలు భావిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

బీసీ ప్రజాప్రతినిధులను కీలుబొమ్మలు చేసిన జగన్

● కంచర్ల శివరామయ్య

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బలహీనవర్గాల ప్రజాప్రతినిధులను జగన్‌రెడ్డి కీలుబొమ్మలుగా మార్చారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల శివరామయ్య అన్నారు. గుంటూరు కొరిటెపాడులోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ ప్రజాప్రతినిధుల హోదాలను కాగితాలకు పరిమితం చేసి కర్రపెత్తనం మొత్తం జగన్ తన సొంత సామాజికవర్గానికి అప్పగించి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పవర్ లేదని, ఎంపీ సంజీవ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని అన్నారు. మీ పదవి మా దయ అంటూ గురజాల ఎమ్మెల్యే బీసీ జడ్పీటీసీని అవమానించడం వారి అగ్రకుల దురహంకారానికి నిదర్శనమన్నారు. బీసీ ఎమ్మెల్యేలను సజ్జల రామకృష్ణారెడ్డి ఎన్నో అవమానాలకు గురిచేశారన్నారు. ఐక్యంగా ఉన్న బీసీలను కార్పొరేషన్లను విభజించి, కులాల పేరుతో చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో వైసీపీ విజయం కోసం సభ నిర్వహించడం అధికార దుర్వినియోగమేనని ఆరోపించారు.

జిల్లాకు కొత్తగా 3,965 రైస్‌కార్డుల మంజూరు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్వైవార్షిక పథకాల విడుదల కింద జిల్లాకు కొత్తగా 3,965 రైస్‌కార్డులను మంజూరు చేసిందని జిల్లా పౌరసర ఫరాల అధికారి కోమలి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు వారి సచివాలయంలో సంబంధిత వలంటీర్ల ద్వారా ఈకేవైసీ వేసి కార్డులను పొందాలని సూచించారు. ఆయా కార్డులకు ఈ నెల నుంచే రేషన్ మంజూరు చేశామని, దీని దృష్ట్యా సమీపంలోని ఎండీయూ వాహనం వద్దకు వెళ్లి రేషన్ పొందాలన్నారు. బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమపిండిని ఈనెల మంజూరు చేశామన్నారు.

జీఎస్టీ అధికారులకు ఎన్నికలపై నిఘా బాధ్యత



ఐజీ పాలరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీజీఎస్టీ కమిషనర్

గుంటూరు, జనవరి 11: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు బహుమతుల రూపేణా పంపిణీ చేసే వివిధ రకాల వస్తువులను నియంత్రించేందుకు సెంట్రల్ జీఎస్టీ అధికారులు తమ నిఘాను పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరినట్లు సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. విజయవాడలో బుధవారం జరిగిన సీఈసీ సమావేశంలో ఈ విషయాన్ని తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి గురువారం గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లను తమ కార్యాలయంలలో ప్రత్యేకంగా కలుసుకున్నారు. రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో సీజీఎస్టీ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పరస్పర సహాయ సహకారం, సమాచారంతో తనిఖీలు చేపట్టే దిశగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు కమిషనర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపిక చేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుతో నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, జనవరి 11: నరసరావుపేట పట్టణంలో డీఎస్ఏ స్టేడియం నందు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులతో రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా స్పోర్ట్స్ సెక్రెటరీ సీహెచ్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు వివరాలను ఆయన తెలియజేశారు. ఎన్ విష్ణుసాయి(కడప), ఏఎస్ కుళ్లాయప్ప(కడప), జీవీఎస్ సాకేత్(కడప), ఏ దేవాషిష్(విశాఖపట్నం), ఏ రోహిత్(విశాఖపట్నం), జి.దేవ ప్రమోద్(గుంటూరు), షేక్ నాగుర్ అబ్దుల్ జబ్బార్(గుంటూరు), వీపీ శ్రీనివాసరెడ్డి(గుంటూరు), షేక్ హుస్సేన్ షరీఫ్(గుంటూరు), ఎన్ సాయిచరణ్ (చిత్తూరు), సి.ఉత్తేజ్(చిత్తూరు), ఎస్ఎల్‌యూకేవై సిద్ధు(చిత్తూరు), షేక్ సమీరుద్దీన్(పశ్చిమ గోదావరి), పీఎస్ కశ్యప్(తూర్పు గోదావరి), టీ శంకర్ రెడ్డి(కర్నూలు), పీ హమేష్ రామ్(నెల్లూరు)లు ఎంపికైనట్లు తెలిపారు. కాగా వీరంతా ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు విక్రమ్‌సింగ్, వ్యాయమ ఉపాధ్యాయులు పూజల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలా చేస్తే గ్యాస్ సిలిండర్ రూ.100కే వస్తుంది!

● రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లా స్పష్టీకరణ



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ కొల్లా రాజమోహన్

గుంటూరు (మెడికల్) జనవరి 11: ఆంధ్రప్రదేశ్‌కు 12వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సు విధంగా మనకు కేజీ బేసిన్ చమురు, గ్యాస్ నిక్షేపాల లాభాల్లో 50 శాతం వాటాను ఇస్తే ఏపీలో గ్యాస్ సిలిండర్ ధర రూ.100లకే ప్రజలకు అందుబాట్లోకి వస్తుందని కేజీ బేసిన్ గ్యాస్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ వెల్లడించారు. గురువారం బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో జైఆంధ్ర డెమోక్రాటిక్ ఫోరం ఆధ్వర్యంలో 'కేజీ బేసిన్ చమురు, గ్యాస్, ఆంధ్రప్రదేశ్ వాటా' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి జై ఆంధ్ర డెమోక్రాటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి అధ్యక్షత వహించారు. కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ కేజీ బేసిన్ చమురు, గ్యాస్ నిక్షేపాలపై 50 శాతం లాభాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిందేనని గట్టిగా కోరారు.

సమావేశంలో జన చైతన్య వేదిక అధ్యక్షుడు వీ లక్ష్మణరెడ్డి , ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీ సేవకుమార్, ఆడిటర్ పీవీ మల్లికార్జునరావు, ఆంధ్ర ప్రజాసమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనలో మంద కృష్ణకు అండగా నిలవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 11: ఎస్సీ వర్గీకరణ సాధించాలనే లక్ష్యంతో పోరాడుతున్న మంద కృష్ణ మాదిగకు మాదిగలందరూ అండగా నిలబడాలని స్వర్ణాంధ్రా ఏమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. గోరంట్లలోని సంఘ కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన సుప్రీంకోర్టులో వర్గీకరణ అంశంపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను మాదిగలకు తెలియజేస్తూ గ్రామ, గ్రామాన చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ నగర అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు రాజేష్, అబ్రహం, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 11: పాత గుంటూరు పరిధిలోని ఎన్టీ ఆర్ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్ పక్కన రోడ్డు మార్జిన్‌లో గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు చని పోయి ఉన్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. మృతుడు స్కైబ్లూ రంగు కలిగిన గడులు కలిగిన నిండు చేతుల చొక్కా, ముదురు నీలం రంగు మీద పువ్వులు, చుక్కల డిజైన్ గల లుంగి ధరించి ఉన్నాడు. నెరిసిన జుట్టు, తెల్లని గడ్డం ఉన్నది. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీస్‌లు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మార్చురీ రూమ్ తరలించారు. వివరాలు తెలిసిన వారు పాత గుంటూరు ఎస్ఐ ఎస్ నాగకుమారి -8688831327 తెలియజేయాలని కోరారు.

దుర్మార్గుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

● తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దుర్మార్గుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి చంద్రబాబు ఇచ్చిన 'రా.. కదలి రా!' పిలుపునందుకుని ప్రజలు ముందుకు రావాలని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు ఇన్‌చార్జులు మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులుతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇచ్చిన 'రా.. కదలిరా' పిలుపునందుకున్న నాటి ప్రజలు 9 నెలల్లో కాంగ్రెస్‌ను కుప్పకూల్చారన్నారు. ఇప్పుడు కూడా రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి అదేస్ఫూర్తితో ప్రజలు ముందుకు వస్తున్నారని, లక్షలాదిగా వచ్చి చంద్రబాబుతో కలిసి నడుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, కల్లూరి శ్రీనివాసరావు, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల ఆత్మగౌరవాన్ని కాపాడేది టీడీపీ మాత్రమే



రజక సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

రజకుల ఆత్మగౌరవం కాపాడేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం టీడీపీ రజక సాధికార సమితి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయనతోపాటు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నసీర్, రామాంజనేయులు, రజక సాధికార రాష్ట్ర కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో తుమ్మేటి మురళి, నాగేశ్వరరావు, బాలయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హామీ ఇచ్చి వంచించిన జగన్

తాను అధికారంలోకి వచ్చాక పిల్లలను చదివించే పూచీ నాదని చెప్పి, ఖర్చు మొత్తం భరిస్తానని హామీ ఇచ్చి ఇవ్వకుండా విద్యార్థులను సీఎం జగన్‌రెడ్డి వంచించాడని తెనాలి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం తాడికొండ నియోజకవర్గ తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో తలతోటి సురేంద్ర, కంచర్ల శివరామయ్య, హనుమంతరావు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు అభివృద్ధికి ఎమ్మెల్యేనే అడ్డంకి

● నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్



బాబు ష్యూరిటీ పత్రాలు అందిస్తున్న నసీర్

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడే అడ్డంకి అని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ ఆరోపించారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన గుంటూరు డీఎస్ నగర్ కాలనీలో ఇంటింటికి తిరిగి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి జగన్‌రెడ్డి తన చేతకానితనంతో రాష్ట్ర అభివృద్ధిని అంధకారంలోకి నెడితే గుంటూరు తూర్పు శాసనసభ్యుడు ముస్తఫా తన వ్యాపారాలు, కమీషన్ల కోసం నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకంగా నిలిచాడని ఆరోపించారు. రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ వహీద్, మాలకొండయ్య, రావి రవి, వెలిది మాలకొండయ్య, ఆంజనేయప్రసాద్, కొండయ్య, షేక్ కరీముల్లా, బ్రహ్మసాని శ్రీను, జానీ, రెహమునిస తదితరులు పాల్గొన్నారు.

చెత్త మీద పన్ను వసూలు చేస్తున్న దిక్కుమాలిన ప్రభుత్వం



కూరగాయలు అమ్మే మహిళతో మాట్లాడుతున్న వల్లూరు జయప్రకాష్ నారాయణ

గుంటూరు సిటీ, జనవరి 11: చెత్త మీద కూడా డబ్బులు వసూలు చేస్తున్న దిక్కుమాలిన ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. నగరంలో గురువారం బీజేపీ విజయ సంకల్ప పాదయాత్ర 9వ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ యాత్ర సాయిబాబా రోడ్డులో సాయిబాబా మందిరం నుంచి ప్రారంభమై సుగాలి కాలనీ, వైశ్యాబ్యాంకు కాలనీ, విద్యానగర్ వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, శనక్కాయల అరుణ, మాగంటి సుధాకర్ యాదవ్, పాలపాటి రవికుమార్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిక్కులు తెచ్చిపెట్టిన నయన్ అన్నపూరణి

నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



ఇటీవలే ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైన నయనతార రీసెంట్ మూవీ 'అన్నపూరణి'ని ఉన్నట్టుండి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలిగించారు. స్వయంగా ఆ చిత్ర నిర్మాణసంస్థ అయిన జీ స్టూడియోస్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి 'అన్నపూరణి' థియేటర్లలో కూడా పెద్దగా ఆడలేదు. థియేటర్లలో మిశ్రమ స్పందనతో నిర్మాతకు నష్టాలే తెచ్చిపెట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేశారు. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. కథ ప్రకారం ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చారు. నయన్‌తోపాటు చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబైలో కేసులు నమోదయ్యాయి. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించింది. మతవిశ్వాసాలను కించపరిచే ఉద్దేశం తమకు లేదని, తమకు అన్ని మతాలూ సమానమేనని, ఈ విషయంలో తెలిసిగానీ, తెలియకగానీ ఎవర్నయినా బాధపెట్టి ఉంటే క్షమించాలని జీ స్టూడియోస్ వివరణ ఇచ్చుకుంది. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది? అనే ప్రశ్నకు సమాధానమే 'అన్నపూరణి' కథ. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిబ్రవరిలో హ్యాపీ ఎండింగ్



యష్ పూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ కథానాయిక. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు తీసకొస్తున్నట్లు యూనిట్ గురువారం తెలిపింది. 'ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కని ఆదరణ లభిస్తోంది, వైవిధ్యమైన కథతో 'హ్యాపీ ఎండింగ్' చిత్రాన్ని రూపొందించాం' అని మేకర్స్ తెలిపారు. అజయ్ ఘోష్, విష్ణు, ఝాన్సీ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి. సినిమాటోగ్రఫీ: అశోక్ సీపల్లి









సుబ్బయ్య పార్థివ దేహంపై టీడీపీ జెండాను కప్పి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, పూర్ణచంద్ తదితరులు

సుబ్బయ్యకు కన్నీటి వీడ్కోలు



సుబ్బయ్యకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె మాలతి

తెనాలి, మారీసుపేట జనవరి 11: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య మతదేహాన్ని అభిమానులు, పార్టీ కార్యకర్తలు దర్శించి కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం మృతిచెందిన పట్టణ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్యకు గురువారం ఆయన కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆయన మృతదేహంపై మాజీ మంత్రివర్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి నివాళి అర్పించి, కడసారి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన నాయకుడు సుబ్బయ్య అన్నారు. ఆయన పార్థివ దేహాన్ని పట్టణ పురవీధులలో కనక తప్పెట్లతో ఊరేగించి అంతిమ సంస్కారాలు అయన కుమార్తె మాలతి నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లి మాణిక్యాలరావు, తాడిబోయిన హరిప్రసాద్, కేసన శంకరావు, మహమ్మద్ ఖుద్దూస్, అత్తోట వందనం, పావులూరు రాంబాబు, కనక రాంబాబు, కనపర్తి శ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్, ఈదర పూర్ణచంద్, చుక్కపల్లి పెదబాబు, కౌన్సిలర్ బ్రహ్మేశ్వరావు, వంగా సాంబిరెడ్డి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, ఈదర శ్రీనివాసరావు, జెట్టి రేణుక, పరుచూరి రమ్య, దేవినేని రమాదేవి, భావన చౌదరి, రమాదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సుబ్బయ్య మృతి బాధాకరం: నాదెండ్ల

తెనాలి క్రైం, జనవరి 11: మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, పట్టణ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య మృతి బాధాకరమని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం గడవర్తి సుబ్బయ్య భౌతికాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అందరితో మమేకమై ఉండేవారని పేదల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి వారి అభిమానాన్ని చూరగొన్న వ్యక్తి సుబ్బయ్య అని కొనియాడారు. ప్రజల మనిషిగా ఈ ప్రాంతంలో సుబ్బయ్య గుర్తింపు పొందరాని అలాంటి వ్యక్తి మృతి బాధాకరమని నాదెండ్ల తెలిపారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట జనవరి 11: పట్టణంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని, స్థానిక శివాజీచౌక్‌లోని రెండో అన్న క్యాంటీన్ గురువారంతో 500 రోజులు పూర్తి చేసుకుందని టీడీపీ సభ్యులు అన్నారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవి దంపతుల సహకారంతో, మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో ఎన్నారై విద్యా సంస్థల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

తిరస్కరించిన కార్యకర్తలు





కొల్లిపరలో ఒంటి కాలిపై నిలబడి, తెనాలిలో కుర్చీలను తలపై పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

పొన్నూరుటౌన్, జనవరి 11: నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు ఇవ్వటం దారుణ చర్య అన్ని సీఐటీయూ నాయకులు నిమ్మకూరి రమేష్ బాబు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు 31వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీల శిబిరం వద్దకు పలు గ్రామాల, పట్టణానికి చెందిన పోస్ట్‌మెన్‌లు వచ్చి రిజిస్టర్డ్ పోస్టులు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినందున రిజిస్టర్ పోస్ట్‌లో వచ్చినవి షోకాజ్ నోటీసులుగా గుర్తించి వాటిని తీసుకునేందుకు అంగన్‌వాడీ మహిళలు తిరస్కరించారు. పోస్ట్‌మెన్‌లు రిజిస్టర్ పోస్టులు తీసుకోవాలని ఒత్తిడి చేయటంతో అంగన్‌వాడీ మహిళలు నిరసన వ్యక్తం చేయటంతోపాటు వెళ్లిపోవాలని పెద్దఎత్తున నినాదాలు చేయటంతో పోస్ట్‌మెన్‌లు వెనుదిరిగి వెళ్లిపోయ్యారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ధ్వజమెత్తారు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. మహిళలు అంటే చిన్నచూపు చూడటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్మాను ఉపసంహరించుకోవటంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

● కొల్లిపర, జనవరి 11: అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 31వరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు ఒంటి కాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్, అంగన్‌వాడీ మండలస్థాయి నాయకులు నిర్మలజ్యోతి, సీతమ్మ, డి.శివపార్వతి, ఆదిలక్ష్మి, సంతోషకుమారి, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవిలత తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరులో రిజిస్టర్ పోస్ట్‌లో వచ్చిన షోకాజ్ నోటీసులు తిరస్కరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయిన జగన్: నేతాజీ

పెదకాకాని, జనవరి 11: రాష్ట్రాన్ని పాలించే అర్హత సీఎం జగన్ మోహన్ రెడ్డి కోల్పోయారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ తెలిపారు. పెద్దకాకాని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ సమ్మె శిబిరం 31వ రోజు అంగన్వాడీలకు గురువారం సంఘీభావం తెలియచేశారు. ఈ సందర్భంగా వై నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జునరావు మాట్లాడి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో కే.రాజ్యలక్ష్మి కనకవల్లి రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: అంగన్‌వాడీ వర్కర్ల గోడు ప్రభుత్వం పట్టకపోవడం శోచనీయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు ఆర్.శివకృష్ణ విమర్శించారు. విజయవాడ రోడ్డులో అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని గురువారం సందర్శించి పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా అంగన్‌వాడీ వర్కర్లు కుర్చీలు తలపై పెట్టుకుని ఆందోళన, నినాదాలు చేశారు. అంగన్‌వాడీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నెల రోజులు దాటినా సమ్మె చేస్తున్న వారితో సంప్రదింపులు చేయకపోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. అసోసియేషన్ నాయకులు తిరుపతమ్మ, శివపార్వతి, సుబ్బలక్ష్మి, ప్రశాంతి, పావని, హసీనా, సిఐటియు నాయకులు హుస్సేన్‌వలి, బాబుప్రసాద్, అశోక్, వినోద్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చేబ్రోలు, జనవరి 11: అంగన్‌వాడీలకు మెమోలు ఇచ్చి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీ నారాయణ ఆరోపించారు. చేబ్రోలులో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు సంఘీభావం తెలిపారు.



పొన్నూరులో శిబిరం వద్ద మాట్లాడుతున్న సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు



పెదకాకానిలో ప్రసంగిస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ

వైసీపీ ఎత్తుగడలను కార్యకర్తలు చిత్తు చేయాలి

● పాదయాత్రలో మాజీ మంత్రి ఆలపాటి



ఎరుకలపూడిలో పాదయాత్ర చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, జనవరి 11: ఎన్నికల్లో కుయుక్తులు పన్ని గెలిచేందుకు ఎన్నో ఎత్తుగడలు వేస్తున్న వైసీపీని చిత్తుచేయాలని, అందుకు జనసేన, టీడీపీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలంలోని ఎరుకలపూడిలో గురువారం ప్రజాయాత్ర తిరిగి ప్రారంభించారు. టీడీపీ నేత గడవర్తి సుబ్బయ్య మృతి కారణంగా ఆగిన యాత్ర అక్కడి నుంచే మొదలైంది. ఎరుకలపూడిలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల పేరిట ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన దానికన్నా అధిక మొత్తంలో వెనక్కి లాగేస్తున్న వైనం ప్రజలు గమనించాలన్నారు. విద్యుత్ చార్జీలు ఆరు రెట్లు పెరిగిపోయాయని, నిత్యావసర వస్తువుల ధరలు మూడురెట్లు పెరిగాయని ఇలా ప్రజలకు అవసరమైన ప్రతి వస్తువు ధరలు పెరుగుతూ పోయాయన్నారు. పథకాల పేరిట వైసీపీ అగ్రనేతలు రూ.వేల కోట్ల ప్రజాధనం దోచుకున్నారని ఆరోపించారు. జనసేన, టీడీపీ కలవడంతో ఆ మైత్రిని చెడగొట్టేందుకు ఎన్నో పన్నాగాలు పన్నుతున్నారని, కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఓటర్ల జాబితాలను నిత్యం గమనించాలని, ఎక్కడైనా తేడావస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు తమ దృష్టికి కూడా తేవాలన్నారు. పాఠశాలలను నాడు-నేడు పేరుతో అభివృద్ధి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వాటికి నిధులు విడుదల చేయకపోవడంతో ఏడాదిగా అసంపూర్తిగా మిగిలిపోయాయని విమర్శించారు. ఈ పథకంలో నేరుగా పాఠశాలలకు అందించిన బెంచీలు, విద్యుత్ పరికరాలు, టైల్స్, టాయిలెట్స్ సామగ్రిలో అధిక ధరలు వేసి భారీ ఎత్తున దోపిడీ చేశారని ఆరోపించారు. భూములు, ఇసుక, మద్యం, అక్రమంగా తొలగించి రూ.వేల కోట్లు దోచేశారని, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ప్రజలకు పనులు లేకుండా, వ్యాపారులకు టర్నోవర్ జరగకుండా పాలన చేస్తున్న వైసీపీని సాగనంపాలన్నారు. రాత్రికి గుడివాడ గ్రామం చేరుకుని అక్కడ బసచేశారు. రూరల్ మండల, ఎరుకలపూడి గ్రామ జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు డయిల్ యువర్ డీఎం

పొన్నూరు టౌన్, జనవరి 11: ఆర్టీసీ సమస్యలపై శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు డయిల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాని నిర్వహిస్తున్నట్లు గురువారం ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆర్టీసీ సమస్యలపై 08643-244441 నెంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్, జనవరి 11: సాయి ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో చినరావూరు డొంకరోడ్డులోని పేదలకు గురువారం అన్నదానం చేశారు. హెచ్‌ఆర్ లక్కరాజు జన్మదినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాయిలక్కరాజు, కోటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో సంక్రాంతి సందడి



చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్

తెనాలి అర్బన్, జనవరి 11: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంక్రాంతి సందడితో కనువిందు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలలో ఏర్పాటుచేసిన సంక్రాంతి అలంకరణలు తిలకించారు. రామమందిరం, రంగవల్లులు, యాగశాల, హరిదాసు కీర్తనలు, ఎడ్ల బండి, బొమ్మల కొలువు సందర్శించారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. ఆవరణలో 60అడుగుల ఎత్తులో చిత్రించిన ఆంజనేయ స్వామి చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమని, విద్యతో పాటు విలువలు కూడా నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం బాలబాలికలు సంక్రాంతి వైభవాన్ని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు, ప్రదర్శనలు, కోలాటం ఆకట్టుకున్నాయి. స్కూల్ వ్యవస్థాపకులు దాసరి రంగలక్ష్మి, ఎండీ మురళీకాంత్, ఈడీ గీతాకాంత్, ప్రవచనకర్త జయసింహ మూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక

నరసరావుపేట కల్చరల్, జనవరి 11: నరసరావుపేట పట్టణంలో డీఎస్‌ఏ స్టేడియంలో ఈ నెల 6నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన క్రీడాపోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులతో రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టును ఎంపికచేసినట్లు పల్నాడు జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ సీహెచ్ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు వివరాలను ఆయన తెలియజేశారు. ఎన్.విష్ణుసాయి (కడప), ఏఎస్ కుల్లాయప్ప (కడప), జీవీఎస్ సాకేత్ (కడప), ఏ దేవాషిష్ (విశాఖపట్నం), ఏ రోహిత్ (విశాఖపట్నం), జి.దేవ ప్రమోద్ (గుంటూరు), షేక్ నాగుర్ అబ్దుల్ జబ్బార్ (గుంటూరు), వీవీ శ్రీనివాస రెడ్డి (గుంటూరు), షేక్ హుస్సేన్ షరీఫ్ (గుంటూరు), ఎస్ సాయిచరణ్ (చిత్తూరు), సి.ఉత్తేజ్ (చిత్తూరు), ఎస్ ఎల్‌యూకేవై సిద్ధు (చిత్తూరు), షేక్ సమీరుద్దీన్ (పశ్చిమ గోదావరి), పీఎస్ కశ్యప్ (తూర్పు గోదావరి), టీ శంకర్‌రెడ్డి (కర్నూలు), పీ హమేష్‌రామ్ (నెల్లూరు)లు ఎంపికైనట్లు తెలిపారు. కాగా వీరంతా ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాల్గొంటారని చెప్పారు.

ఆర్‌వీ ఐటీలో సంక్రాంతి సంబరాలు

చేబ్రోలు, జనవరి 11: సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్ని ఆర్‌వీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య అన్నారు. గురువారం చేబ్రోలు ఆర్‌వీఐటీలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి విద్యార్థులు నృత్యాలు చేసారు. వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ గొట్టిపాటి మస్తాన్‌చౌదరి, డైరెక్టర్ మాలపాటి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, జనవరి 11: సంగంజాగర్లమూడి కొమ్ముమూరు కాలువలో గల్లంతైన గుంటూరు ఏటుకూరు రోడ్డుకు చెందిన కౌలూరి నాని (18) మృతదేహం గురువారం లభించింది. బుధవారం సాయంత్రం నాని అతడి తమ్ముడు, మరో ఇద్దరితో కలిసి మండలంలోని సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామివారి ఆలయం సమీపంలో కొమ్ముమూరు కాలువలో ఈతకు దిగారు. అక్కడ నీటి ప్రవాహానికి నాని మునిగి కొట్టుకుపోయాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా గురువారం సంగంజాగర్లమూడి లాకుల సమీపంలో నాని మృతదేహాన్ని వెలికితీశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ముస్లింలను మోసగిస్తున్న వైసీపీ

● టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్

పొన్నూరు టౌన్, జనవరి 11: ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తూ వైసీపీని మోసగిస్తున్నదని టీడీపీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్ ఆరోపించారు. గురువారం పట్టణ టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ముస్లిం నాయకులు మాట్లాడుతూ ముస్లింల విషయంలో దుష్ప్రచారాలకే వైసీపీ పరిమితమైందని ఆరోపించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఏపీజే అబ్దుల్ కలామ్‌ను రాష్ట్రపతిని చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. పొన్నూరులో ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి హయాం నుంచి నరేంద్రకుమార్ వరకు ముస్లింలకు పెద్దపీట వేశారన్నారు. 258మందికి దుల్హన్ పథకం కింద రూ.1.29కోట్లు మంజూరు చేసిన్నట్లు చెప్పారు. 40మంది ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాల కింద రూ.కోటి మంజూరు అయ్యాయన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 680మందికి రూ.6.76 కోట్లు, 959 మందికి రూ.14.35 కోట్లతో గృహ నిర్మాణం, 510 మందికి టిడ్కో గృహాలు, 7759మందికి ఉపకార వేతనాలు మంజూరు చేయించిన ఘనత ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కే దక్కుతుందన్నారు. ధైర్యం ఉంటే నాలుగున్నర ఏళ్లుగా ముస్లింల కోసం వెచ్చించిన నిధుల వివరాలను బయట పెట్టాలని వైసీపీకి సవాళ్లు విసిరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా అధికారి ప్రతినిధి షేక్ బాజీసాహెబ్, మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీన్‌పీరా, ఇస్మాయిల్, లాడెన్, కరిముల్లా, బాజీ, ఖాజా, మజీదా పాల్గొన్నారు.



కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో కూడారై మహోత్సవం

పొన్నూరు టౌన్, జనవరి 11: పవిత్ర ధనుర్మాస ఉత్సవంలో భాగంగా గురువారం తెలగపాలెం కోదండ రామాలయంలో కూడారై మహోత్సవం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుతీరిన శ్రీసీతలక్ష్మణహనుమత్ సమేత కోదండ రామస్వామికి, రంగనాథ సమేత గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూడారై పర్వదినాన్ని పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. అనంతరం తిరుప్పావై పఠించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణరామాచార్యులు, దేవరాజస్వామి, తిరుప్పావై పారాయణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డీసీఐ సభ్యురాలు డాక్టర్ పి.రేవతికి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్, ప్రక్కన వైద్యులు కృష్ణమోహన్, నగేష్, ప్రకాష్ తదితరులు

సిబార్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

● ముఖ్యఅతిథిగా హాజరైన డీసీఐ సభ్యురాలు డాక్టర్ రేవతి

పెదకాకాని, జనవరి 11: విద్యార్థులందరూ స్నేహంగా మెలగాలని.... ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీసీఐ) సభ్యురాలు ప్రొఫెసర్ డాక్టర్ పి.రేవతి సూచించారు. గురువారం తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పి.రేవతి మాట్లాడుతూ కష్టపడి చదివి కళాశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిస్టర్ ఫ్రెషర్, మిస్ ఫ్రెషర్, లక్కీ ఫ్రెషర్ గా గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి, అభినందించారు. సభలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను నిష్ణాతులైన దంత వైద్యులుగా తీర్చిదిద్దమే తమ కళాశాల యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమ లను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ బి వి రమణారెడ్డి, వైస్ డీన్‌లు డాక్టర్ మన్నే ప్రకాష్, డాక్టర్ బొల్లా నగేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

176 మంది వీవీఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

పెదకాకాని, జనవరి 11: ప్రతిష్టాత్మక బహుళజాతీయ సంస్థ, గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ 'యాక్సెంచర్'లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 176మంది విద్యార్థులు ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. సరైన ప్రణాళిక, మానసిక సంసిద్ధత ద్వారా భారీ సంఖ్యలో వీవీఐటీ విద్యార్థులు ఈ నియామకాలు పొందగలిగారని తెలిపారు. 2023 డిసెంబరు 1 నుంచి 15 వరకు యాక్సెంచర్ సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరచడం ద్వారా ఈ నియామకాలు లభించాయని అన్నారు. నియామకాలు పొందిన విద్యార్థులకు 6.5 లక్షల నుండి 4.5 లక్షల వార్షిక వేతనాలు సంస్థ కేటాయించినట్లు తెలిపారు. అనంతరం నియమకాలు పొందిన విద్యార్థులను వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, అకడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు, ఫ్రెష్మాన్ డీన్ డాక్టర్ ఎమ్.వి.రఘురామ్, ఉపాధికల్పన, శిక్షణాధికారి డాక్టర్ యా.మాధవ్, అధ్యాపకులు అభినందించారు.



సుబ్బారావు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సంగం డెయిరీ అధికారులు

రైతులను ఆదుకోవడంలో సంగం డెయిరీ ముందంజ

● పాలకేంద్రం అధ్యక్షుడు శ్రీనివాసరావు

కొల్లిపర, జనవరి 11: సంగం డెయిరీ రైతులను ఆదుకోవడంలో ముందంజలో ఉంటుందని పాల కేంద్రం అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని హనుమాన్‌పాలెంలో పాల ఉత్పత్తిదారుడు పలిశెట్టి సుబ్బారావు ఇటీవల మృతి చెందటంతో డెయిరీ తరుపున అతని కుటుంబ సభ్యులకు డీసీసీ అభయ పథకం ద్వారా 50వేల రూపాయల చెక్కును సంగం డెయిరీ అధికారులు, పాల కేంద్రం అధ్యక్షుడు శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగం డెయిరీకి పాలు పోయడం వలన రైతులకు అనేక రాయితీలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఫీల్డ్ కో ఆర్డినేటర్ సందీప్‌కృష్ణ, డెయిరీ సూపర్‌వైజర్ వెంకట్రావు, పాల కవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.